క్లుప్తంగా

శివకృష్ణకు జ్యోతిష శిరోమణి బిరుదు ప్రదానం



శివకృష్ణను సత్కరిస్తున్న ఎస్ఎస్ లైవ్ ఆస్ట్రో సంస్థ సభ్యులు

ప్రకాశం నగర్: నగరానికి చెందిన జ్యోతిష పండితుడు ఎస్‌వైబీఎస్ శివకృష్ణ జ్యోతిష శిరోమణి బిరుదు అందుకున్నారు. హైదరాబాద్‌లో గురువారం ఎస్ఎస్ లైవ్ ఆస్ట్రో సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ జ్యోతిషుడు నరసింహస్వామి ఆయనకు బిరుదు ప్రదానం చేశారు. జ్యోతిషంలో అనేక పరిశోధనలు చేస్తున్న శివకృష్ణ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: గర్భిణులు పోషకాహారం సక్రమంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని మాజీ ఎంపీటీసీ నయనాల వరపద్మ మంగతాయారు అన్నారు. పోషన్ పక్వాడా పక్షోత్సవాలలో భాగంగా బొమ్మూరులోని అంగనవాడీ కేంద్రం -3లో గురువారం గర్భిణులకు సీమంతం, ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మంగతాయారు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువ కలిగిన ఆహారం తయారు చేసుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త మాధవీదేవి, హెల్పర్ రామలక్ష్మి పాల్గొన్నారు.

ఐన్‌స్టీన్ సేవలు చిరస్మరణీయం



ఐన్‌స్టీన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్రరావు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో గురువారం అల్బర్ట్ ఐన్‌స్టీన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో ఐన్‌స్టీన్ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో రాణించాలన్నారు. ముందుగా కళాశాలలోని ఐన్‌స్టీన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భౌతికశాస్త్ర విభాగాధిపతి సీహెచ్.కోమల లక్ష్మి, బి.దుర్గాలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏఆర్‌టీ సెంటర్ల తనిఖీలు



ఏఆర్‌టీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

కంబాలచెరువు: ఏఆర్‌టీ క్లినిక్, లెవెల్ 2, ఏఆర్‌టీ బ్యాంకుల అనుమతికి దరఖాస్తు చేసుకున్న కేంద్రాలను జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గైనకాలజీ నిపుణులున్న ఆస్పత్రులు ఏఆర్‌టీ క్లినిక్‌లకు దరఖాస్తు తీసుకోవచ్చన్నారు. అనధికారికంగా ఏఆర్‌టీ క్లినిక్ నడుపుతుంటే వెంటనే మూసివేస్తామన్నారు. హాస్పిటల్‌లో ఈ సెంటర్ నిర్వహణకు ప్రభుత్వం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ఏఆర్‌టీ కేంద్రాలను ఇన్‌స్పెక్షన్ టీం వచ్చి రికార్డులను పరిశీలించిందన్నారు. ఇన్‌స్పెక్షన్ టీం కమిటీ మెంబర్లు డాక్టర్ అక్కమాంబ, పాథాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నజీర్, చిన్న పిల్లల నిపుణులు డాక్టర్ ఝాన్సీ, డిప్యూటీ డీఈఎంవో సత్యకుమారి, ఎంపీహెచ్ఎస్ ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి పదోసారి పోటీ : గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో పదోసారి టీడీపీ నుంచి పోటీ చేస్తున్నానని పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గురువారం విడుదల చేసిన రెండో జాబితాలో రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా గోరంట్ల పేరును ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడోసారి అసెంబ్లీ లో అడుగుపెట్టబోతున్నానని ధీమా వ్యక్తం చేశారు.
నేడు జయహో బీసీ సభ : హుకుంపేట డిమార్ట్ పక్కనే ఖాళీస్థలంలో శుక్రవారం మధ్యాహ్నం 3.00 గంటలకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధ్యక్షతన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల జయహో బీసీ బహిరంగ సభ జరుగుతుంది. ఈ మేరకు గోరంట్ల కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

పేదల సొంతింటి కల సాకారం



శాటిలైట్‌సిటీలో లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ, మేడపాటి షర్మిలారెడ్డి, రౌతు సూర్యప్రకాశరావు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణు
- రూరల్ నియోజకవర్గంలో 24,614 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

రాజమహేంద్రవరం రూరల్: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. శాటిలైట్ సిటీ, బొమ్మూరు, హుకుంపేట గ్రామాల్లోని లబ్ధిదారులకు గురువారం సాయంత్రం శాటిలైట్ సిటీలో ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి వేణు మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో 24,614 లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశామన్నారు. నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా అర్హులైన మహిళా లబ్ధిదారుల పేరుతో ఇళ్ల స్థల పట్టాలను అందజేశామన్నారు.

రాష్ట్రాభివృద్ధికి నిరంతర కృషి

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి సీఎం జగన్ నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి వేణు అన్నారు. పిల్లలందరికీ ఉన్నత విద్యను అందించాలని లక్ష్యంతో అమ్మఒడి, విద్యా కానుక, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్య వంటి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నాడు మహానేత వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రు.2.50 లక్షలతో ఆరోగ్యానికి భరోసా కల్పిస్తే నేడు సీఎం జగన్ మోహన్ రెడ్డి దానికి పదింతలు పెంచి రూ.25 లక్షలకు పెంచారన్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతిల్లు ఉండాలన్న లక్ష్యంతో సీఎం జగన్ రాష్ట్రంలో 31 లక్షలకు పైబడి ఇళ్లస్థలాలను అందించి, ఇళ్లు కూడా నిర్మించి అందజేస్తున్నారన్నారు. రూరల్ ఎమ్మెల్యేగా మంత్రి వేణుగోపాలకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. రుడా చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ రుడా ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం మంత్రి వేణు, మేడపాటి షర్మిలారెడ్డి, రౌతు సూర్యప్రకాశరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ప్రదానం చేశారు.

బీసీ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

శాటిలైట్‌సిటీలోని ఏ బ్లాకులో రూ.40 లక్షలతో నిర్మించే బీసీ కమ్యూనిటీ హాలుకు మంత్రి వేణుగోపాలకృష్ణ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అప్పారావు, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

25 వేల మందికి ఇళ్ల పట్టాల ప్రదానం

- సుబ్రహ్మణ్య మైదానంలో కార్యక్రమం
- లబ్ధిదారులకు అందజేసిన ఎంపీ భరత్‌రామ్, మంత్రి వేణు



ఇంటిపట్టా అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో గూడూరి శ్రీనివాస్, రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: పేదల సొంతింటి కల నెరవేరుతున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. నగరంలోని సుబ్రహ్మణ్య మైదానంలో గురువారం 25 వేల మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంతింటి కల పేదలదైతే, వారికి పట్టాలివ్వాలన్నది జగనన్న ఆశయన్నారు. ఎన్నికలకు ముందే ఇళ్ల పట్టాలిస్తానని లబ్ధిదారులకు చెబుతూ వచ్చామని, జగనన్న దయతో అది నెరవేర్చగలిగామన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా టీడీపీ నాయకులు అడుగడుగునా కుట్రలు పన్నుతూ, లేనిపోని బురదజల్లుతూనే ఉన్నారన్నారు. ఎవరెన్ని రకాల విమర్శలు, ఆరోపణలు చేసినా లబ్ధిదారులు అందరి తరఫునా సీఎం జగనన్నకు మరోసారి ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. ముందుగా కోటిపల్లి బస్టాండ్ నుంచి సుబ్రహ్మణ్య మైదానం వరకూ ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ భరత్‌రామ్‌ను ఊరేగింపుగా తరలి వచ్చారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కె.దినేష్ కుమార్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఏపీ హౌసింగ్ బోర్డ్ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, వైఎస్సార్ సీపీ పార్లమెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, సిటీ అబ్జర్వర్ రావిపాటి రామచంద్రరావు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్య మైదానంలో జరిగిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు



లబ్ధిదారుకు ఇంటి పట్టా అందజేస్తున్న మంత్రి వేణు, చిత్రంలో షర్మిలారెడ్డి, కమిషనర్ దినేష్ కుమార్

మహోన్నత వ్యక్తి కారల్ మార్క్స్

ప్రకాశం నగర్: మానవ చరిత్రను మలుపుతిప్పిన మహోన్నతుడు కారల్ మార్క్స్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కారల్ మార్క్స్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయంలో..

శ్యామల సెంటర్ సమీపంలోని సీపీఎం కార్యాలయంలో మార్క్స్ చిత్రపటానికి ఆ పార్టీ సీనియర్ నాయకుడు టీఎస్ ప్రకాష్, జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి.తులసి, బి.పవన్, రాజులోవ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



విజేత రాజమహేంద్రవరం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఓఎన్‌జీసీ అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతానుదాస్

రాజమహేంద్రవరం రూరల్: చదువుతో పాటు క్రీడలలో రాణించడం ద్వారా ప్రతి ఒక్కరికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతానుదాస్ అన్నారు. రోటరీక్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం ఓఎన్‌జీసీ మైదానంలో జరిగిన ఫైనల్స్‌లో కాకినాడ, రాజమహేంద్రవరం జట్లు తలపడ్డాయి. తుదిపోరులో కాకినాడపై రాజమహేంద్రవరం విజయం సాధించింది. అనంతరం విజేతలకు శాంతానుదాస్ చేతుల మీదుగా ట్రోఫీ అందజేశారు. ఐకాన్స్ క్లబ్ అధ్యక్షుడు తీగెల రాజా మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించిన శాంతానుదాస్, టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన సీనియర్ కోచ్ శ్రీహరి, ఇతర కోచ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. టోర్నమెంట్‌కు స్పాన్సర్‌గా వ్యవహరించిన కమల్ గ్లాస్ యాజమాన్యాన్ని, సహకరించిన వారందరిని ఐకాన్స్ తరపున సత్కరించారు. క్రీడాకారులకు భోజనం ఏర్పాట్లు చేసిన ఇస్కాన్ డైరెక్టర్ శ్యామన్ శ్రీనివాస్‌దాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రోగ్రాం చైర్మన్ మద్దూరి శంకర్ ఈ టోర్నమెంట్‌కు ఆయన తండ్రి స్వర్గీయ నాగభూషణం జ్ఞాపకార్థం ప్రధాన స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ అనుకుమార్, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల : భీమా
సూర్యమినీ : బస్తర్, యోధా
సూర్యప్యాలెస్ : కుంగ్‌ఫూ పాండా-4
స్వామి : వెయ్ దరువెయ్
శివజ్యోతి : హనుమాన్
అనుశ్రీ : ప్రేమలు
రాజా : రజాకార్
ఊర్వశి : రజాకార్
రంభ : తంత్ర
మేనక : లంబసింగి, షరతులు వర్తిస్తాయి
అప్సర : గామి
కుమారి : మాయ, ప్రేమలు
నామవరం
వీఎస్ మహల్ : రజాకార్
ధవళేశ్వరం
మురళీకృష్ణ : ప్రేమలు

వైఎస్సార్ సీపీలో చేనేత కుటుంబాల చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో నరేన్, వీరభద్రయ్య తదితరులు

కడియం: మండలంలోని పొట్టిలంక గ్రామానికి చెందిన సుమారు 40కి పైగా చేనేత కుటుంబాలు టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరాయి. వారందరికీ మంత్రి చెల్లుబోయిన వేణు కుమారుడు నరేన్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నరేన్ మాట్లాడుతూ చేనేత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా సహాయ పడేందుకు తాము సిద్ధంగా ఉంటామన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఏ మాత్రం పట్టించుకోని బుచ్చయ్య చౌదరికి మళ్లీ సీటు కేటాయించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య మాట్లాడుతూ గతంలో టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న చేనేత కులానికి చెందిన చందన రమేష్‌ను అన్యాయంగా మార్చి, బుచ్చయ్య చౌదరి సీటు తెచ్చుకున్నారన్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక బుచ్చయ్య నియోజకవర్గాన్ని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. చేనేతలకు 50 సంవత్సరాలకే పింఛన్, మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. వేణుగోపాలకృష్ణను ఎమ్మెల్యేగా గెలిపించుకుని మళ్లీ మంత్రిగా చేసుకొనే బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. పొట్టిలంక సర్పంచ్ కొత్తపల్లి సత్యవతి మాట్లాడుతూ చేనేత యువత వైఎస్సార్ సీపీలో చేరడం సంతోషమని, అందరూ సమష్టిగా కృషి చేసి, చెల్లుబోయిన వేణు విజయానికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో నూలు మల్లేశ్వరరావు, ముక్తేశ్వరరావు, చిన వీర్రాజు, కొత్తపల్లి సత్య, కృష్ణ, వీరభద్రరావు, ప్రకాష్, సూరిబాబు, గంగాధరం పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ అడ్వైజరీ కమిటీ సభ్యుల నియామకం



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న అడ్వైజరీ కమిటీ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ప్రధాన రైల్వే స్టేషన్ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా బీజేపీకి చెందిన ఏడుగురిని నియమిస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు గురువారం స్టేషన్ మేనేజర్ రంగనాథ్, సీటీఐ చంద్రమౌళి చేతుల కమిటీ సభ్యులైన యానాపు ఏసు, చింతపల్లి సతీష్, బండి సత్యప్రసాద్, పోతురాజు సుబ్రహ్మణ్యం, భోజి హరికృష్ణ, వెలిశెట్టి రామకృష్ణ, ముచ్చా పరశురామ్‌లకు ఉత్తర్వులు అందించారు. అనంతరం ఆ సభ్యులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి పార్టీ కార్యాలయంలో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌తో పాటు గోదావరి, నిడదవోలు, అనపర్తి స్టేషన్లకు కూడా ఆయా మండలాల పరిధిలోని బీజేపీ నాయకులు అడ్వైజరీ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బూరా రామచంద్రరావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరామ్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కందికొండ రమేశ్, స్వచ్ఛ భారత్ సెల్ జిల్లా కన్వీనర్ కొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రాజానగరం: వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నియోజకవర్గంలోని 41 మందికి మంజూరైన రూ.15.16 లక్షల చెక్కులను గురువారం పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ రాజమహేంద్రవరంలోని స్వగృహం వద్ద లబ్ధిదారులకు వీటిని అందజేశారు. ఇంతవరకూ నియోజకవర్గంలోని మూడు మండలాలలో 1,153 మందికి రూ.9.53 కోట్ల సీఎంఆర్ఎఫ్ సాయం అందించినట్టు ఆమె తెలిపారు.

రైతు కూలీల ప్రదర్శన

రాజానగరం: ఢిల్లీలో జరిగిన రైతుల ఉద్యమానికి మద్దతుగా అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రాజానగరంలో గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఉద్యమ సమయంలో రైతులకు ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాన సత్రం నుంచి గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా బస్టాండ్ వరకూ ప్రదర్శన సాగింది. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు, డివిజన్ నాయకులు మరుకుర్తి వీరలక్ష్మి, బులిశెట్టి సత్యవతి పాల్గొన్నారు.

రైతు ఉద్యమంపై మొండి వైఖరి విడనాడాలి

పెదపూడి: రైతాంగ ఉద్యమంపై ప్రధాని మోదీ మొండివైఖరిని విడనాడాలని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అన్నారు. స్థానిక కై కవోలు సెంటర్లో ఏపీఆర్‌సీఎస్, బారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఛలో ఢిల్లీలో భాగంగా ధర్నా చేపట్టామన్నారు. మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని, ఆహార భద్రత చట్టాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు మడికి సత్యం, ఎల్లే సత్తిబాబు, వి.సత్తిబాబు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పోషణ సంపూర్ణం.. చక్కని ఆరోగ్యం..



కోరుకొండ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో సిబ్బంది

మధురపూడి: రేపటి తరాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ పోషకాహారాన్ని అందిస్తోంది. దానిలో భాగంగా మార్చి 9 నుంచి 23 వతేదీ వరకూ పక్షోత్సవాన్ని నిర్వహిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం, వాటి ఉపయోగాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. తక్కువ ఖర్చుతో పోషకాహారాన్ని తయారు చేసుకోవడాన్ని తెలియజేస్తున్నారు. కోరుకొండ సీడీపీఓ పరిధిలో ఉన్న కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల్లో 228 వరకూ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో 11,133 మంది చిన్నారులు, 1,133 మంది గర్భిణులు, 1,331 మంది బాలింతలు ఉన్నారు.

23 వరకూ పక్షోత్సవాలు

ఐసీడీఎస్‌కు చెందిన అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లు, ఆయాలు ఈనెల 9వ తేదీ నుంచి 23 వరకూ పౌష్టికాహార పక్షోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా చిన్నారులు, వారి తల్లులకు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలను జరుపుతున్నారు. రాగులు, జొన్నలు, గంటి, కొర్రలు, గోధుమ తదితర చిరుధాన్యాలతో పోషకాలు అధికంగా అందుతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఆకుకూరలు ఎక్కువగా తినడం వల్ల హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది. ఇలా చిరుధాన్యాలు, ఆకుకూరల వల్ల కలిగే ప్రయోజనాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు.

సంపూర్ణ పోషణ

భవిష్యత్తు తరాలను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పోషకాహారంతో పాటు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తోంది. ఈ పక్షోత్సవంలో ఇప్పటివరకూ 60 శాతం మందికి వీటిని పంపిణీ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లో రెండున్నర కేజీల సోడిపిండి, రెండున్నర కేజీల అటుకులు, పావుకేజీ బెల్లం, పావుకేజీ వేరుశనగ అచ్చులు, పావుకేజీ కర్జూరం, 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు ఉంటాయి. అలాగే ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు నెలకు 25 కోడి గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు, రెండున్నర కేజీల బాలామృతం ఇస్తున్నారు.

గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలి



డాక్టర్ అనసూరి పద్మలత

రాజమహేంద్రవరం సిటీ: తెనాలి పట్టణంలోని బీసీ సామాజికవర్గానికి చెందిన గీతాంజలి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి, వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లకు గురువారం రాజమహేంద్రవరం నుంచి బహిరంగలేఖ రాశారు. గీతాంజలి ఆత్మహత్య చేసుకునేలా సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంటి పట్టా ఇచ్చిన సందర్భంగా గీతాంజలి తన సంతోషాన్ని వ్యక్తం చేస్తే, కొందరు సోషల్ మీడియా ద్వారా ఆమెను మానసిక క్షోభకు గురిచేయడం దారుణమన్నారు.

ఓటుహక్కు వినియోగంపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి

ధవళేశ్వరం: ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ కేఎన్ జ్యోతి అన్నారు. ధవళేశ్వరం స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో గురువారం ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జ్యోతి మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేలా అనేక సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. దివ్యాంగులు, నడవలేని వృద్ధులు బీఎల్‌వోలను సంప్రదించి, ఇంటి దగ్గరే ఓటు హక్కు వినియోగించుకునే సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డీడీ సందీప్, డీడీఆర్‌సీ సుధాకర్, సన్యాసిరావు, సోమ, రంగమణి పాల్గొన్నారు.